



# రెవెన్యూకు.. పూర్వ వైభవం



## గ్రామ పాలన అధికారులను నియమించడంతో పునరుద్ధరణ చర్యలు

- విద్యార్హతలను బట్టి గత వీఆర్‌వో, వీఆర్‌ఏలకు రాత పరీక్షతో ఎంపిక
- అయినా పూర్తి స్థాయిలో ఎంపిక కాని అభ్యర్థులు.. ఖాళీల భర్తీ ఎలా?
- రెవెన్యూ రికార్డులు, కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు ఇకపై వీరికే..
- గతంలో వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేసిన అప్పటి ప్రభుత్వం



అడ్డాకుల మండలం కన్మనూరు గ్రామ పంచాయతీ కార్యాలయం



మహబూబ్‌నగర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెవెన్యూ శాఖలో అవినీతి, అక్రమాలకు కేంద్ర బిందువులుగా వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు మారుతున్నారనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఈ రెండు వ్యవస్థలను రద్దు చేసి వారిని వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సర్వీస్ కోల్పోయి కేడర్‌ను తగ్గించుకొని వివిధ శాఖల్లో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలపాటు అప్పట్లో వీరిని సర్దుబాటు కూడా చేయకపోవడంతో ఏం చేస్తారో తెలియక అవస్థలు పడ్డారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకువస్తానని హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా కొత్త పోర్టల్‌ను ఏర్పాటు చేసి.. పట్టాదారుల హక్కులను కాపాడటం, సులభతర రిజిస్ట్రేషన్ ప్రక్రియ, భూ వివాదాల పరిష్కారం చేస్తామని చెప్పింది. తర్వాత భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఫిర్యాదులను కూడా స్వీకరించింది. ఇప్పుడు ఆ ఫిర్యాదుల పరిష్కారం ప్రక్రియ జరుగుతోంది. అయితే గతంలో పకడ్బందీ రెవెన్యూ రికార్డులు నిర్వహించిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు లేకపోవడంతో పరిష్కార ప్రక్రియ కొలిక్కి రావడంలేదు. దీంతో రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామ పాలన అధికారులను నియమిస్తామని ప్రకటించింది. గతంలో వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలను వారి విద్యార్హత ఆధారంగా రాత పరీక్ష నిర్వహించింది. కొన్ని జిల్లాల్లో రెండు, కొన్ని జిల్లాల్లో మూడు విడతలుగా రాత పరీక్ష జరగ్గా ఎంపికైన వారు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. వారికి గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కార బాధ్యతలను అప్పగించనున్నారు. దీంతో రెవెన్యూ వ్యవస్థకు పూర్వవైభవం

(మిగతా 6లో..)

## ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

- రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు
- తాగునీరు సరఫరా చేయాలని ఎంపీడీవోకు వినతి

7

## హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

6



సెమీస్‌లో తలపడుతున్న క్రీడాకారులు

## డీఎల్ఐ కాల్వలో తల లభ్యం

- తండ్రిని చంపిన కొడుకు ఘటన

6

## శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

- 1.22 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఒక గేటు ద్వారా 27,662 క్యూసెక్కులు విడుదల



# కమీషన్ల కోసమే.. కాళేశ్వరం

- బీఆర్ఎస్ పదేళ్లలో పేదలకు ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలే
- 'డబుల్' ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కేసీఆర్ వల్లనే కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి



రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులను నూతన గృహ ప్రవేశం చేయిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్

గద్వాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్నదని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి పొంగులేటి గద్వాల పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించి.. 715 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదోడికి ఇళ్లు ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం కూడా లేని బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్యలో మొండి గోడలను వదిలేస్తే మేము పూర్తి చేసి పేదలకు పంచుతున్నామని అన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తే కమీషన్లు రావని కేసీఆర్ నిధులన్నీ కాళేశ్వరం ప్రాజెక్టుకు మళ్లించి కమీషన్లు తీసుకొని పేదలను వంచించాడని ఆరోపించారు.

రాష్ట్రఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.22,500కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా ఉన్నవి తొలగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7లక్షల కొత్తకార్డులను జారీ చేసిందిని తెలిపారు. గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కృషితో ఇక్కడ 1,275 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మీరు ఆశీర్వదిస్తేనే ఇక్కడ నిలబడి మాట్లాడుతున్నామని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మీ ఆశీర్వాదం ఉండాలని కోరారు.

### కేసీఆర్ వల్లనే కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు : మంత్రి జూపల్లి

కేసీఆర్ వల్లనే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 64ఏళ్లలో 22మంది సీఎంల పాలన చేసి రూ.75వేల కోట్లు అప్పు చేస్తే.. కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.8లక్షల కోట్ల అప్పు చేశాడని విమర్శించారు. ఆయన చేసిన అప్పుకు ఈ ఏడాది సీఎం రేవంత్‌రెడ్డి రూ.1.20 లక్షల కోట్ల వడ్డీ చెల్లించారని అన్నారు. పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం వేల కోట్లు ఖర్చు చేస్తుందని వివరించారు. ప్రతీ నియోకవర్గంలో రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తుందని వివరించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొంతమంది కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని అంటున్నారని, పాదర్శకంగా డిప్పు ద్వారా ఎంపిక చేశామని వివరించారు. ఇదివరకు ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఉన్న 99 మంది పేర్లు తొలగించారని వివరించారు. అప్పట్లో అవినీతి జరిగిందని వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని మంత్రులను కోరారు. లబ్ధిదారులతో కలిసి డబుల్ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం సహపంక్తి భోజనం చేశారు. సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# నడిగడ్డలో పాగా వేద్దాం



వివిధ పార్టీల కార్యకర్తలకు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ డీకే అరుణ

గద్వాల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) నడిగడ్డలోని గద్వాల, ఆలంపూర్ నియోజకవర్గాలలో వచ్చే ఎన్నికల లో పాగా వేద్దామని పాలమూరు ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. శనివారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి దాదాపు 200 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... జోగుళాంబ గద్వాల జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో బీజేపీ పాగా వేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల లోపు ఆ రెండు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ఇన్‌చార్జి డీకే స్నిగ్ధారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండల వెంకట్రాములు, రమాసాయిబాబ, పట్టణ అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



కొండారెడ్డిపల్లిలో పర్యటిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):గ్రామ అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సీఎం రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వాలని అధికారులను అదేశించారు. పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూనియన్‌బ్యాంకు, తపాలా కార్యాలయం, అంగన్‌వాడీ భవనం, పాఠశాల అదనపు గదుల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, ఈఈ విజయ్‌కుమార్, ఏడీఎం శ్రీనివాసులు, తహసీల్దార్ పాల్గొన్నారు.

# సర్వేపల్లిని స్ఫూర్తిగా తీసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్య క్షుడు చిన్నారెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ పురస్కారాలు-2025 కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పురస్కారాలకు ఎంపికైన 63 మంది ఉపాధ్యాయులకు మెమొంటో, ప్రశంసా పత్రం అందించి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ స్థాయి నుంచి దేశ ప్రథమ పౌరుడి స్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు. రాధాకృష్ణన్ పుట్టిన రోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఉపాధ్యాయులకు గొప్ప గౌరవమని తెలిపారు. విద్యావ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చే సేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయులకు పదోన్నతులు, కొత్త టీచర్ల నియామకం చేపట్టారని వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడు మనసు పెట్టి పాఠాలు బోధించి జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. పురస్కారాలు అందుకున్న టీచర్లకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్లు కీమ్యానాయక్, యాదయ్య, ఇన్‌చార్జి డీఈవో మహమ్మద్ అబ్దుల్ ఘని, విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎంలు ఉన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి






## అధ్వానం.. ఆవాసం

- అస్తవ్యస్తంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు..
- దోమల బెడద.. రోగాల భయం
- వణుకుతున్న జనం

6

# చెలరేగుతున్న సీసీవై గ్యాంగ్

- గద్వాల పట్టణంలో అర్ధరాత్రి మారణాయుధాలతో హల్‌చల్
- వినాయక లడ్డును పారేసిన దుండగులు
- మాజీ కౌన్సిలర్, మునిసిపల్ ఉద్యోగిపై దాడి
- దౌదర్‌పల్లిలో ఓ వ్యక్తిపై హత్యాయత్నం
- గతంలో కూడా పలు కేసుల్లో కీలక సూత్రధారులు





సీసీవై గ్యాంగ్ చేసిన దాడిలో గాయపడిన మాజీ కౌన్సిలర్ మహేష్, శ్రీనివాసులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో సీసీవై(చంపు లేదా చావు యూత్) గ్యాంగ్ అంటే హడల్.. వీరు గతంలో పలు కేసుల్లో కీలక సూత్రధారులు. తాజాగా జిల్లా కేంద్రంలో శనివారం తెల్లవారుజామున ఓ మాజీ కౌన్సిలర్‌తో పాటు ఆయన తండ్రి మునిసిపల్ ఉద్యోగిపై, కాలనీ యువకులపై మారణాయుధాలతో దాడి చేశారు. అదేవిధంగా వినాయక లడ్డూను సగం తిని మిగ తాది మురుగు కాలువ పక్కనే పడేశారు. దీంతో పాటు దౌదర్‌పల్లి కాలనీలో ఓ వ్యక్తిని హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి బాధితులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సీసీ గ్యాంగ్ శనివారం తెల్లవారుజామున గద్వాల పట్టణంలోని దౌదర్‌పల్లి కాలనీలో మద్యం కొనుగోలు చేయడానికి ఓ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో మద్యం ఇవ్వకపోవడంతో పక్కనే ఉన్న మధు అనే వ్యక్తి ఇంటి తలుపులను తన్నడంతో పాటు నీవు బయటకు వస్తావా... తలుపులు బద్దలు కొట్టి నిన్ను చంపాలా..

మిగతా 6లో..

## చెలరేగుతున్న సీసీపై గ్యాంగ్

(5వ పేజీ తరువాయి..)

అంటూ బెదిరించారు. మధు బయటకు రాకుండా పోలీసులకు సమాచారం అందిచారు. ఆ తర్వాత సీసీపై గ్యాంగ్ సభ్యులు దాదాపు 30 మంది బైక్‌లపై రామ్‌నగర్‌వైపు వెళ్లారు. అక్కడ బెల్ట్ దుకాణంలోకి వెళ్లి మద్యం తాగారు. అక్కడి నుంచి అంబేడ్కర్‌నగర్ వైపు వచ్చారు. మద్యం మత్తులో ఉన్న ఆ గ్యాంగ్‌లోని గోపి, అంజి, సభాష్ అనే యువకులతో పాటు మరికొందరు ఆటువైపు వెళ్తూ గణేష్ విగ్రహం వద్ద ఉన్న లడ్డూను తీసుకునేందుకు యత్నించారు. అక్కడే ఉన్న కొందరు మీరు మద్యం మత్తులో ఉన్నారు, ఇలా లడ్డూను తాకవద్దని చెబుతూ మాజీ కౌన్సిలర్ మహేష్, మునిసిపల్ ఉద్యోగి శ్రీనివాసులుకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన మాజీ కౌన్సిలర్ మహేష్, మునిసిపల్ ఉద్యోగి(మహేష్ తండ్రి) శ్రీనివాసులు, మహేష్ తమ్ముడు వినయ్‌ను సీసీ గ్యాంగ్ సభ్యులు విచక్షణ రహితంగా కర్రలు, కత్తులతో దాడి చేశారు. అదేవిధంగా కాలనీలో ఉన్న దివ్యాంగుడు సంతోష్‌పై కూడా దాడి చేశారు. ఈ దాడిలో మునిసిపల్ ఉద్యోగి శ్రీనివాసులు వద్ద ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తీసుకెళ్లారు. అంతటితో ఆగకుండా వినాయకుడి లడ్డూ తీసుకొని తినడంతో పాటు ఆ మిగిలిన లడ్డూను ఓ మురుగు కాలువ సమీపంలో పడేసి పారిపోయారు. గాయాలైన వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు దౌదర్‌పల్లికి చెందిన మధు, మాజీ కౌన్సిలర్ మహేష్‌లు తెలిపారు. ఈ గ్యాంగ్ గతంలో కూడా గౌతమ్ అనే యువకుడిని విచక్షణ రహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే.

## చెరుకు రైతుల సమస్యలు పరిష్కరించండి



ఫ్యాక్టరీ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అమరచింత, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే రాజన్న పేర్కొన్నారు. శనివారం కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ అధికారులను తమ సంఘం కుమ్మరి జిల్లా నాయకులతో కలిసి చెరుకు రైతుల సమస్యలను వివరించినట్టు ఆయన తెలిపారు. గత ఏడాది ప్రకటించిన సబ్సిడీని ఫ్యాక్టరీ యజమాన్యం ఈ ఏడాది కూడా కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. చెరుకు కోతలకు సరిపడా అడ్వాన్స్‌లను చెల్లించి ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు పంట అభివృద్ధి అయ్యేవిధంగా సహకరించాలని యజమాన్యం కోరినట్లు ఆయన తెలిపారు. ఆ సంఘం నాయకులు నారాయణ, రామకృష్ణారెడ్డి, వాసారెడ్డి, చిన్న అంజనేయులు, చంద్రసేనారెడ్డి, రవి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎల్ఐ కాల్వలో తల లభ్యం

- తండ్రిని చంపిన కొడుకు ఘటన

కల్వకుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హత్యకు గురైన బాలయ్య తల డిండి లిఫ్ట్ ఇరిగేషన్ (డీఎల్ఐ) కాలువలో శనివారం సాయంత్రం లభ్యమైంది. ఈ మేరకు కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళితే.. కల్వకుర్తి పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన బాలయ్య(70)ను చిన్న కొడుకు బీరయ్య బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలంలో దాడి చేసి హత్య చేసిన విషయం విదితమే. తన బామ్మర్దిని కారులో పిలిపించుకుని వంగూరు మండలం సదగోడు సమీపంలో బాలయ్య మృతదేహం నుంచి తలను, మొండెంను వేరుచేసి తలను డీఎల్ఐ కాల్వలో, మొండెం డిండిచింతపల్లి సమీపంలోని బ్రిడ్జి వద్ద దుందుభీ నదిలో వేశారు. శుక్రవారం రాత్రి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఉప్పునుంతల మండలం కొరటికల్ సమీపంలోని నదిలో తల లేని మొండెంను గుర్తించిన విషయం తెలిసిందే. మొండెంను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం రాత్రి పోలీసులు తరలించారు. తల ఆచూకీ కోసం సీఐ, ఎస్ఐ అదుపులో ఉన్న బీరయ్యతో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించి, డిండి చింతపల్లి-సదగోడు గ్రామాల మధ్య డీఎల్ఐ కాల్వలో బాలయ్య తలను శనివారం సాయంత్రం గుర్తించారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అందించినట్లు వివరించారు.

## మహబూబ్‌నగర్ మార్కెట్లోకి 'రెనాల్ట్‌కైగర్ టర్బో' కారు




మార్కెట్లోకి 'రెనాల్ట్‌కైగర్ టర్బో'కారును విడుదల చేస్తున్న కరూర్ వైశ్యబ్యాంక్ మేనేజర్ మాధురి

పాలమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మార్కెట్లోకి 'రెనాల్ట్‌కైగర్ టర్బో' కారును కరూర్ వైశ్యబ్యాంక్ మేనేజర్ మాధురి, ట్రెండ్ గ్రూప్ ఈడీ గట్టు శ్రీహర్షిత్‌రెడ్డితో కలిసి శనివారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన టర్బో, ఎనర్జి ఇంజన్ కలిగిన ఈ కారు సరికొత్త భద్రతా ప్రమాణాలతో 6ఎయిర్‌బ్యాగ్స్, క్రూజ్ కంట్రోల్ సిస్టమ్ లకిగి గ్రామీణ రహదారులకు అనుకూలంగా గ్రౌండ్ క్లియరెన్స్ కలిగి, మల్టీ వ్యూ కెమెరా, ఆటో హెడ్ ల్యాంప్, రెయిన్‌సెన్సింగ్ వైపర్స్, 40.64 సెంటీమీటర్ల డైమండ్ కట్ అలాయ్ వీల్స్‌తో ఆరు రంగుల్లో, పెంట్రోల్ వెర్షన్‌తో 20.38 కిలోమీటర్ మైలేజ్ ఇస్తుందని పేర్కొన్నారు. ఎక్స్ షోరూం ధర రూ.6.29 లక్షలు ఉన్నట్లు చెప్పారు. సేల్స్ మేనేజర్ రమేష్, సర్వీస్ మేనేజర్ సందీప్, కస్టమర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అధ్వానం.. ఆవాసం

- సరిగాలేని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇళ్ల మధ్య మురుగునీరు..
- దోమల బెడద.. రోగాల భయం
- వణుకుతున్న జనం



అక్బర్ పేట కాలనీలో ఇంటిలోకి వెళ్లి నిలిచిన వర్షపు నీరు



అసంపూర్తి పూడికతీత వల్ల మురుగు నీరు నిలిచిన కందకం

అలంపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సరిగా లేని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో ఆ ప్రాంతాలు మురుగు నీటిలోనే మగ్గుతున్నాయి. మురుగునీరు కారణంగా ఆవాసాలు అధ్వానంగా ఉండటంతో దోమలు, విషకీటకాల భయం వెన్నాడుతోంది. విషజ్వరాల భయంతో జనం జంకుతున్నారు. ఈ పరిస్థితి అలంపూరు నియోజకవర్గ కేంద్రంలో నెలకొన్నది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మునిసిపాలిటీ కేంద్రంలో డెంగీ వంటి ప్రాణాంతక విష జ్వరాలు, మలేరియా, చికెన్ గున్యా వంటి విషజ్వరాల భయాందోళన ప్రజలను వెంటాడుతున్నది. మునిసిపాలిటీలో ఐదవ వార్డులో జోగుళాంబ గుడికి వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తోంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేకపోవడంతో మురికి నీరు పేరుకుపోయి దుర్వాసన వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిలో చెత్త పేరుకుపోయి దోమలకు నిలయంగా మారింది. అలాగే 6,7 వార్డులు వంటి పలు కాలనీలలో డ్రైనేజీలు లేక, అస్తవ్యస్తంగా ఉండి మురుగు నీరు పేరుకుపోయింది. పట్టణంలోని చాలా డ్రైనేజీలు పూడికతో నిండి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఏర్పడింది. నీరు ఎటూ కదలని పరిస్థితి నెలకొంటోంది. దాంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవటంతో దోమల ఉధృతి పెరిగిపోతున్నది. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని, ఈ మురుగు నీరు ఎత్తిపోసేందుకు దారి ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

### పూడిక తీయకపోవడంతో..

ప్రధానంగా పట్టణ కేంద్రంలోని కాలనీల్లో ఉన్న అంతర్గత కాలువలు, డ్రైనేజీలతో పాటు కందకాలలో చెత్త, చెదారం పూడికతీత పనులు నామమాత్రంగా తొలగించడం వల్ల పేరుకుపోయిన చెత్తాచెదారంతో డ్రైనేజీల్లో మురుగు నీరు పొంగి పొర్లుతున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి చిన్న, చిన్న కాలువల నుంచి వచ్చే మురుగు నీరంతా కందకంలో కలుస్తున్నాయి. సక్రమంగా పూడిక తీయకపోవడంతో కందకం నిండా చెత్తా చెదారాలతో నిండిపోతున్నాయి. ప్రస్తుతం భారీగా వర్షాలు కురవడంతో కాలువల ద్వారా వచ్చే మురుగు నీరు ఐదవ వార్డులోని కందకంలో నిండుకుండలా దర్శనమిస్తోంది. కందకం పక్కనే ఉన్నందున ఇంటి గోడలు కూడా నెర్రెలు వచ్చి దెబ్బతింటున్నాయని, ఇళ్లు కూలితే మా పరిస్థితి ఏంటని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు నిండుకున్నాయి.

దాంతో మురుగునీరు పారకుండా అవి అడ్డుకుంటున్నాయి. నేటికి పట్టణంలో దోమల నివారణా చర్యలు మచ్చుకైనా కనిపించకపోవడం గమనార్హం.

### అక్బర్‌పేట.. జల దిగ్బంధం

కురుస్తున్న వర్షాలతో అక్బర్‌పేట జల దిగ్బంధంలో కూరుకుపోయింది. ఇళ్ల ముంగిట మురుగు నీటి దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. గతంలో కూడా వరదలు వచ్చి ఇళ్లు మునిగిపోతే ఏ ఒక్క అధికారి, స్థానిక ప్రజా ప్రతినిధులు వచ్చి చూశారే కానీ.. పట్టించుకున్న పాపానపోలేదని స్థానికులు వాపోతున్నారు.

దుర్వాసనతో దోమలు, కీటకాల కారణంగా విషజ్వరాలతో బాధపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీ వారు శానిటేషన్ చేయట్లేదని ఆరోపిస్తున్నారు.

### కాల్వలను శుభ్రం చేయించాలి..



దోమలను లార్వా దశలో ఉన్నప్పుడే నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టాలి. సమస్యాత్మక ప్రాంతాల్లో క్రమం తప్పకుండా యాంటీ లార్వా ఆపరేషన్ చేయించాలి. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలి. దోమల విజృంభణతో ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

\- సంజీవ నాయుడు, అలంపూరు

### పైసా బడ్జెట్ లేదు..



మురుగు నీటిని కాలనీలలో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. మునిసిపాలిటీలో పైసా బడ్జెట్ లేక ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది. కలెక్టర్‌ను కలిసి మాట్లాడి ప్రతీ సమస్యను వివరిస్తాం. అలంపూర్‌లో ప్రధాన సమస్య అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ. చాలా చిన్న పైపులు ఉండటంతో చెత్తా, చెదారం పేరుకుపోవడం.. చాలా ఇబ్బంది ఉన్నది. చాలా వరకు సమస్యలు తీర్చే విధంగా కృషి చేస్తాం.

\- శంకర్, మునిసిపల్ కమిషనర్

# హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

- నేడు ఫైనల్ మ్యాచ్‌లు




సెమీస్‌లో తలబడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-13 బాల,బాలికల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలోని మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. శనివారం రెండో రోజు క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. పలువురు క్రీడాకారులు సత్తాచాటి సింగిల్స్, డబుల్స్‌లో ఫైనల్స్‌కు చేరారు. బాలుర మొదటి సెమీఫైనల్స్ సింగిల్స్‌లో పబ్బు శివన్స్(మేడ్చల్ మల్కాజ్‌గిరి) 15-11, 15-10 పాయింట్లతో అద్వాత్ సత్తు(వికారాబాద్)పై, రెండో సెమీఫైనల్స్‌లో కుంజల జస్ప్రీత్(వరంగల్) 15-9, 15-11 పాయింట్లతో రామ్‌చరణ్ తేజ ఆకుల(మేడ్చల్ మల్కాజ్‌గిరి)పై గెలిచి ఫైనల్‌కు చేరాయి.

బాలికల మొదటి సెమీఫైనల్‌లో నిమ్మశాన్వి(సంగారెడ్డి) 15-10,15-12 పాయింట్లతో డియ ఆనంద్(వికారాబాద్), రెండో సెమీఫైనల్‌లో అనుముల శ్రీవైభవి(నిజామాబాద్) 15-11, 8-15, 15-11 పాయింట్లతో మనిస్విని భుక్య(వరంగల్)పై గెలిచి ఫైనల్‌కు చేరారు.

బాలుర డబుల్స్ విభాగంలో మొదటి సెమీఫైనల్‌లో కార్తికేయ మహర్షి(రంగారెడ్డి), పబ్బుశివన్ (మేడ్చల్‌మల్కాజ్ గిరి)లు 16-14, 15-12 పాయింట్లతో అద్వైత్ సత్తు, మక్కి సుహిట్‌యాదవ్ (వికారాబాద్)పై, రెండో సెమీఫైనల్‌లో రామ్‌చరణ్ తేజ ఆకుల (మేడ్చల్ మల్కాజ్‌గిరి), శౌర్యప్రతాప్‌సింగ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి)లు 15-12,15-5 పాయింట్లతో అభిషిక్త్(కరీంనగర్), కుంజుల జస్ప్రీత్(వరంగల్)పై గెలిచి ఫైనల్‌కు చేరారు. బాలికల విభాగంలో మొదటి సెమీఫైనల్‌లో ఆభా జాదవ్ (రంగారెడ్డి), డియ ఆనంద్(వికారాబాద్)లు 17-15, 15-7 పాయింట్లతో భూషణ్ క్షేత్రినిత్సిత(వికారాబాద్), గాదె అన్విరెడ్డి(సూర్యాపేట)పై, రెండో సెమీఫైనల్‌లో దీక్ష సహస్ర బండ(మహబూబ్‌నగర్), నిమ్మశాన్వి(సంగారెడ్డి)లు 8-15,15-13, 12-15 పాయింట్లతో ల్యోష కోరుకొండ (వికారాబాద్), మనస్విని భుక్య (వరంగల్)పై గెలిచి ఫైనల్‌కు చేరాయి.

# ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్




కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల

- పట్నం విద్య పల్లెకు చేరువ
- ప్రాథమిక విద్యనుంచి ఉన్నత విద్యాసంస్థలన్నీ కొడంగల్‌లోనే ఏర్పాటు
- ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ

కోస్గి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొడంగల్.. ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది. గతంలో డిగ్రీ చదవాలంటే మహబూబ్‌నగర్ ఇంజనీరింగ్, ఐటీఐ చదవాలంటే పట్నం వెళ్లాల్సిన పరిస్థితి ఇక్కడి విద్యార్థులకు ఉండేది. ఇక నుంచి ప్రాథమిక విద్యనుంచి ఉన్నతవిద్యవరకు ఈ ప్రాంత విద్యార్థులు ఇక్కడే ప్రభుత్వ విద్యాసంస్థలోనే చదువుకునేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పట్నం విద్యను పల్లెకు చేరువ చేయాలని తలంచారు. ఈ ప్రాంత విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్ కోసం పట్నం బాటపట్టి ఆర్థికంగా తల్లిదండ్రులకు భారం కాకూడదని ఇంజనీరింగ్ కళాశాల కోస్గిలో, మెడికల్ కళాశాల కొడంగల్‌లో ఏర్పాటు చేశారు.

అందుకు అనుగుణంగా కాడ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఏర్పాటుకోసం నూతన భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అదేవిధంగా, కోస్గిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మద్దూర్‌కు డిగ్రీ కళాశాల, దుద్యాల మండలం హకింపేట వద్ద ప్రభుత్వ ఇంటర్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, మరియే ఏటీసీ సెంటర్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నింటిని ప్రభుత్వ పరంగా అనుమతులిచ్చి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే ఇంటర్, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ ప్రారంభం కాగా మిగిలిన విద్యా సంస్థలన్నీ వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యవరకు ఏ రంగంవైపైనా ఈ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే చదువుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఏటీసీతో ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా కలగనున్నాయి.

### అన్ని విద్యాసంస్థలు కొడంగల్‌కు రావడం సంతోషకరం

కొడంగల్ నియోజకవర్గంలో ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలలు వస్తాయని అనుకోలేదు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రంలో ఎక్కడా లేకున్నా కొడంగల్‌లో ఏర్పాటు చేయడమనేది అంతసులభతరం కాదు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యమైంది. నేను హైదరాబాద్‌లో ఎంతో కష్టపడి బీటెక్ చేశాను. ఇప్పుడు ఆ విద్యకోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేదు.

\- శివకుమార్, కోస్గి

### అన్ని విద్యాసంస్థలు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం

వచ్చే విద్యాసంవత్సరం నాటికీ ఐటీఐ, ఏటీసీ సెంటర్ ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. తాత్కాలిక భవనాలలో కొనసాగుతున్నాయి. వాటికి నూతన భవన నిర్మాణాలు కూడా చేపడుతున్నాం.

\- వెంకట్‌రెడ్డి, కాడ అధికారి

## రెవెన్యూకు పూర్వ వైభవం

( 5వ పేజీ తరువాయి )

వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

### ఉమ్మడి జిల్లాలో ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 306 రెవెన్యూ గ్రామాలు ఉండగా 191 క్లస్టర్లు ఉన్నాయి. విద్యార్హతలను బట్టి పరీక్ష నిర్వహించగా 137 మంది పాత వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు గ్రామపాలన అధికారులుగా ఎంపికయ్యారు. నాగర్‌కర్నూలు జిల్లాలో 189 మంది జీపీఓలను కేటాయించగా 112 మంది జీపీఓలు ఎంపికయ్యారు. వనపర్తి జిల్లాలో 81 మంది జీపీఓ పోస్టులకు ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లాలో 124 మంది, గద్వాల జిల్లాలో 79 మంది జీపీఓలు ఎంపికయ్యారు. అయితే గతంలో వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన చాలామంది వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు విద్యార్హత లేకపోవడం వల్లనో లేదా సర్దుబాటు చేసిన శాఖల్లోనే విధులు బాగా ఉండటంతో అక్కడే ఉండాలని నిర్ణయించుకోవడంతో వెనక్కి రాలేదు. మొత్తం వీఆర్‌ఓలు వెనక్కి వచ్చి వీఆర్‌ఏలు విద్యార్హత సరిపోయిన వారు కూడా ఎంపికై ఉంటే కేటాయించిన జీపీఓ పోస్టులు మొత్తం సర్దుబాటు అయ్యేవి. అయితే అలా రాకపోవడం వల్ల జీపీఓలకు నియామక పత్రాలు ఇచ్చిన తర్వాత కూడా చాలావరకు రెవెన్యూ క్లస్టర్లు జీపీఓలు లేక ఖాళీగా ఉండే పరిస్థితి ఉంది. మిగిలిన పోస్టుల్లో ఎవరిని భర్తీ చేస్తారనే విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. అయితే గతంలో కూడా వీఆర్‌ఓ, వీఆర్‌ఏ పోస్టుల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల ఒక్కో వీఆర్‌ఓ మూడు నుంచి ఐదు గ్రామాలను చూసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, జీపీఓల భర్తీ తర్వాత కూడా అదే పునరావృతమైతే పనిభారం ఎక్కువవుతుందనే అభిప్రాయం ఉన్నది.

### వారి బాధ్యతలివే...

గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ రద్దు చేసిన తర్వాత భూ వివాదాల పరిష్కారం చాలా జఠిలంగా మారింది. ప్రతీ విషయానికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, కలెక్టర్ల వద్దకు వెళ్లాల్సి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అప్పిలేట్ అథారిటీగా ఉన్న ఆర్డీఓ, జేసీ కోర్టులు కూడా రద్దు కావడంతో కలెక్టర్ వద్ద లేకపోతే కోర్టుకే అన్నట్లుగా వ్యవహారం సాగింది. అయితే జీపీఓల నియామకం తర్వాత వారి విధులపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.

జీపీఓలు గతంలో ఉన్న వీఆర్‌ఓ, వీఆర్‌ఏ విధులతో పాటు భూ భారతి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కీలకంగా మారనున్నారు. గ్రామస్థాయిలో అన్ని ధ్రువీకరణ పత్రాల జారీలో విచారణ నిర్వహించనున్నారు. విద్యార్హత, నివాసం, కులం ధ్రువీకరణ పత్రాల జారీకి విచారణలు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, చెట్ల పరిరక్షణ, భూముల సర్వే కొలతలకు సహాయకులుగా వ్యవహరిస్తారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, గ్రామస్థాయిలో శాఖల మధ్య సమన్వయకర్తలుగా జీపీఓలు వ్యవహరిస్తారు. దీనివల్ల గ్రామపాలన సులభంగా జరగడంతో పాటు రెవెన్యూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

- 1.22 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఒక గేటు ద్వారా 27,662 క్యూసెక్కులు విడుదల

గద్వాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం ప్రాజెక్టుకు 1.22 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్టు ఒక గేటు ద్వారా 27,662 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,980 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 210.51 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 78 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 85 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 80 వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 25 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తుంది. ప్రస్తుతం జూరాలకు 1.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 8 గేట్లను ఎత్తి 56,648 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 40,978 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 22 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

## పోలీసు వాహనంపై దాడి.. యువకులపై కేసు నమోదు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై గొడవకు దిగి వాహనంపై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసిన సంఘటన వనపర్తి పట్టణ కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వనపర్తి పట్టణ కేంద్రంలోని రాయిగడ్డ కాలనీ వీర హనుమాన్ యూత్ సభ్యులు రాయిగడ్డ కాలనీలో గణపతి ముందు డీజే సౌండ్ పెట్టి అక్కడ ప్రజలకు ఇబ్బంది కలగజేస్తున్నారని సమాచారంతో టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో కలిసి వెళ్లారు.

డీజే సౌండ్ తక్కువ చేయాలని ఆ యువతకు సూచించిన ఎస్ఐ మాటలు పెడచెవిన పెట్టారు. ఎస్ఐతో గొడవకు దిగి ప్రభుత్వ వాహనాన్ని ధ్వంసం చేసిన యూత్ సభ్యులు మొగిలి మణిశంకర్, శివకృష్ణ, సింగనమోని రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

# అత్యవసరమైతే.. వైద్యం అంతంతే!

- కరువైన ఆక్సిజన్.. పెరుగుతున్న రోగులు
- నిధుల లేమితో భారమైన ఆసుపత్రి నిర్వహణ
- విషమించిన రోగులను కర్నూల్‌కు తరలింపు
- ఇదీ వందపడకల ఆసుపత్రి పరిస్థితి



వందపడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వందపడకల ఆసుపత్రికి రోగులు క్యూ కడుతున్నారు. సీజనల్ వ్యాధుల ప్రాబల్యంతో మెరుగైన వైద్యం కోసం అలంపూరు చౌరస్తాలోని వందపడకల ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీరియస్ కేసులకు అవసరమయ్యే ఆక్సిజన్ కరువైంది. వారం రోజులుగా ఆసుపత్రిలో ఆక్సిజన్ నిలువలు లేక రోగులకు సరైన వైద్యం అందించడంలో వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితులలో పలువురు రోగులను మెరుగైన వైద్యం కోసం వెనక్కి పంపినట్లు సమాచారం. ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు జూలై 23నుంచి సిబ్బందిని, పలువురు వైద్యులను ఇక్కడ కేటాయించారు. వైద్యుల పనితీరు, సిబ్బంది చొరవతో అనతి కాలంలోనే ఆసుపత్రికి రోగులు క్యూ కడుతున్నారు. కానీ ఇక్కడ సరైన పరికరాలు వచ్చినా వాటికోసం గదుల కేటా యింపు జరగకపోవడంతో వాటిని అమర్చకపోవడం కారణంగా అవి వినియోగంలోకి రాలేదు. దీంతో అవసరమైన పలు పరీక్షల కోసం నమూనాలను జిల్లా ఆసుపత్రికి పంపాల్సి వస్తుంది. ఇక ఎక్స్‌రే పరికరం, ఈసీజీ పరికరం ఇంతవరకు ఇన్‌స్టాలైజేషన్ చేయలేదు. దీంతో కోసం రోగులు కర్నూలు లేదా, గద్వాలకు వెళ్తున్నారు.

ఇదిలా ఉండగా, ఆసుపత్రి ప్రారంభమై 50రోజులు కావస్తున్నా నిర్వహణ కోసం నిధులు కేటాయించలేదు. ఆసుపత్రి ప్రారంభమైన వారం రోజుల తర్వాత పంచ లింగాల వద్ద ఉన్న ఓ ప్లాంటు నుంచి 47కిలోల బరువుగల రెండు సిలిండర్లు తెప్పించారు. మొదట్లో ఆక్సీ జన్ అవసరమైన రోగులు తక్కువ ఉండటంతో దాదాపు నెల రోజుల దాకా వచ్చాయి. అయిదురోజుల క్రితం ఖాళీ అయ్యాయి. వాస్తవానికి ఇక్కడ కనీసం 47కిలోలు గల సిలిండర్లు వందదాకా నిలువ ఉండాలి. కానీ నిర్వహణ నిధులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో నిలువ పెట్టుకోలేకపోతున్నారు. వైద్యులు, సిబ్బంది కొరతతో కూడా వైద్యం అంతంతమాత్రం అందుతోంది.

### నిర్వహణ భారం సిబ్బందిపై పడుతోంది..

కాగా, ఉమ్మడి జిల్లా వైద్య విధాన పరిషత్ సమన్వయ అధికారి డాక్టర్ రమేష్‌చంద్ర 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఆసుపత్రికి నిధులు కేటాయించని కారణంగా నిర్వహణ భారం సిబ్బందిపై పడుతున్నమాట వాస్తవమే. ఇందుకు సూపరింటెండెంట్ బాధ్యత తీసుకోవాలని సూచించాం. ఈ నేపథ్యంలోనే ఆక్సిజన్ కొరత ఏర్పడింది. అయినా అవసరమైన రోగుల కోసం చేతినుంచి నగదు వెచ్చించి ఆక్సిజన్ తెప్పించుకోవాలని సూచించాం. ఆసుపత్రిలో పని చేసేవారేవరైన హాజరు కావాల్సిందే. లేని పక్షంలో జీతంలో కోత విధించాల్సి వస్తుంది. రోగులకు సరైన వైద్యం అందించడంలో రాజీపడం.


పేట సుభాష్‌రోడ్ శ్రీను ఫ్రెండ్స్ నర్సింహస్వామిని శాంతింపజేసేందుకు శరభాసురుడిరూపం శివుడి అలంకరణ


వేంకటేశ్వరస్వామి అవతారంలో


పేటలో వరాహరూప అలంకరణ


పేటలో వామనరూపంలో వినాయక అలంకరణ


గణేష్ నిమజ్జనానికి తరలి వస్తున్న ప్రజలు


ఆపరేషన్ సిందూర్ అలంకరణ

# వినాయక.. సెలవిక

● ఊరూవాడ నుంచి నిమజ్జనానికి కదిలిన విగ్రహాలు

**వివిధ ఆకృతులతో** కొలువైన గణనాథుడి విగ్రహాల నిమజ్జనం అంగరంగ వైభవంగా శనివారం కొనసాగింది. ఊరూవాడ నుంచి నిమజ్జనానికి వినాయక విగ్రహాలు కదిలాయి. అదిరిపోయే నృత్యాలతో నిర్వాహకులు చూపరులను ఆకట్టుకున్నారు. డప్పులు, అడుగుల భజనలతో ఔరా అనిపించారు. నారాయణపేటలో శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమై శనివారం రాత్రి వరకు కొనసాగిన వినాయక నిమజ్జన ఉత్సవ అలంకరణలు చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. గణేశ్ యువజన సంఘాలు, చిన్నారుల రికార్డింగ్ డ్యాన్సులు భక్తులను మంత్ర ముగ్ధులను చేశాయి. నిమజ్జన ఉత్సవ అలంకరణలు కట్టిపడేశాయి.

- నారాయణపేట, ఆంధ్రజ్యోతి


పేట బీమండీ కాలనీ వారి ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలిన గణేశుడు..


నారాయణపేటలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం


పేట హజీఖాన్‌పేట వినాయకుడి ముందు అడుగుల భజనలు చేస్తూ


పేటలో శివుడి అలంకరణలో గణనాథుడు

క్రైం కార్నర్

## పందిని తప్పించబోయి..

» అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టిన బైకు, యువకుడి మృతి

» మరో యువకుడికి గాయాలు


శాగ ప్రమోద్ (ఫైల్)

జడ్చర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొట్టి బైకుపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం అర్ధరాత్రి అనంతరం చోటుచేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు.. జడ్చర్ల పట్టణంలోని త్రిశూల్‌నగర్ కాలనీకి చెందిన శాగ ప్రమోదర్(22), తన స్నేహితుడు ప్రభుకుమార్‌లు కలిసి శుక్రవారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో ద్విచక్రవాహనంపై జడ్చర్ల కొత్తబస్టాండుకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో ఉన్న ఎంబీ చర్చి మలుపు వద్ద పంది అడ్డం వచ్చింది. దాన్ని తప్పించబోయి బైకు అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో బైకుపై నుంచి పడిన శాగ ప్రమోద్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైకుపై ఉన్న మరో యువకుడు ప్రభుకుమార్‌కు తలకు, కుడి భుజానికి రక్తగాయాలయ్యాయి. వెంటనే జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై శాగ ప్రమోద్ తండ్రి శాగ యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కొండన్న (ఫైల్)

కొత్తకోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని జాతీయ రహదారి పాలెం వాగు బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామనంతపూర్ గ్రామానికి చెందిన కొండన్న (57) తన ద్విచక్రవాహనంపై కొత్తకోట జాతీయ రహదారి మీదుగా స్వగ్రామం వెళ్తున్నాడు. కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కొండన్నను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## కాల్వలో పడి వృద్ధుడు..

» నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామంలో ఘటన


గుణగంటి బొజ్జయ్య(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెదిన గుణగంటి బొజ్జయ్య(65) కేఎల్‌ఐ కాల్వలో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. శ్రీపురం గ్రామానికి చెందిన గుణగంటి బొజ్జయ్య గత కొంతకాలంగా మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. గత నెల 28వ తేదీన ఇంటి నుంచి మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయా డు. చుట్టుపక్కల బంధువుల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం శ్రీ పురం రోడ్డు పక్కల ఉన్న కేఎల్‌ఐ కాల్వల్లో శవమై నీటిలో తేలాడు. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో గ్రామానికి చెందిన ఉప్పరి చెన్నయ్య చూ సి గ్రామస్థులు తెలియజేశారు. మృతుని కుమారుడు అంజనేయులు చూసి తమ తండ్రిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని కోడె మృత్యువాత

» ఖననం చేసిన దేవాదాయ శాఖ అధికారులు


మృతి చెందిన కోడె

కృష్ణ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని స్వయంభు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి పేరున వదిలిన కోడె మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. స్వయంభు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి మొక్కులు మొక్కుకున్నా భక్తులు కోడె వదిలిన కోడె మాగనూరు మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో గ్రామస్థులు దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావడంతో దేవాదాయ సిబ్బంది, గ్రామస్థులు కోడెను అక్కడే పూజలు నిర్వహించి జేసీబీ ద్వారా ఖననం నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు.

# కంటి మీద కునుకే లేదాయె..

» అర్ధరాత్రి నుంచి ఆర్డీఎస్ రైతుల పడిగాపులు


అయిజలో యూరియా కోసం క్యూలో మహిళా రైతులు

అయిజ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా యూరియా కోసం స్పందించిన రైతులు దానికోసం అర్ధరాత్రి నుంచి పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఆర్డీఎస్ ఆయకట్టు కింద వరి నాట్లు పూర్తయ్యాయి. బస్తా యూరియా కోసం రాత్రిళ్లు కష్ట పడాల్సి వస్తోంది. ప్రైవేటు వ్యక్తుల దగ్గర ఇతర కాంప్లెక్స్ ఎరువులు కొంటే ఒక బస్తా యూరియా మాత్రమే అందిస్తారు. ఇక ఎరువులు సింగిల్‌విండో ద్వారా ప్రభుత్వమే అందిస్తోంది. బుధవారం యూరియా పంపిణీ రైతు వేదిక నందు సాగింది. రెండు రోజుల వ్యవధి ఇచ్చి శనివారం పంపిణీ చేస్తారని తెలిసి అర్ధరాత్రి 12 గంటల నుంచి రైతులు అయిజ రైతు వేదిక వద్ద క్యూలో పడిగాపులు కాస్తూ కానవచ్చారు. కొందరు చెప్పులు క్యూగా వాడుతున్నారు. మహిళలు, తమ దగ్గర ఉన్న వస్త్రాలను, సంచులను, చెప్పులను, ఆకు సంచులను క్యూలో పెట్టి తమ వంతు కోసం ఎదురు చూడడం కనిపించింది. ఒక రైతుకు 2 బస్తాల యూరియా మాత్రమే అందచేస్తున్నారు. కొంత మంది రైతులు కష్టం చేసి అలసిసొలసి అక్కడే కునుకు తీయడం గమనార్హం.

ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు ఆంజనేయులు, భీమన్న, సుధాకర్‌గౌడులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ శనివారం యూరియా అందిస్తామని అధికారులు చెప్పడంతో అర్ధరాత్రి నుంచి క్యూలో పడిగాపులు కాశామని తెలిపారు. కాగా, శనివారం 900 యూరియా బస్తాలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి జనార్దన్, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

● అలంపూర్: మండలంలోని పీఏసీఎస్ కేంద్రానికి యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు శనివారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. గత కొన్ని నెలలుగా యూరియా దొరకక రైతులు పడుతున్న ఇబ్బందులపై అధికారులు స్పందించారు. రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు పీఏసీఎస్ సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి పంపిణీ చేశారు.

● పెంట్లవెల్లి: సింగిల్ విండో కార్యాలయంలో యూరియాను పోలీస్ భద్రతా నడుమ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెంట్లవెల్లి ఏఎస్‌ఐ ఖయ్యూం ఆధ్వర్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పంపిణీ చేపట్టారు.

● పాన్‌గల్: మండల కేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయం ముందు యూరియా కోసం శనివారం వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు చేరుకోవడంతో కార్యాలయం ఆవరణమంతా రైతులతో కిక్కిరిసి పోయింది. దీంతో రైతులను అదుపు చేసేందుకు అక్కడికి పోలీసులు చేరుకొని వారి పర్యవేక్షణలో యూరియా పంపిణీ టోకెన్లను పంపిణీ చేశారు.

## రెండు గంటల పాటు రాస్తారోకో


కోయిలకొండ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

కోయిలకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యూరియా అందించాలని శనివారం కోయిలకొండ మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. కోయిలకొండ వివేకానంద చౌరస్తాలో వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. కొంత సేపు ఆందోళన నిర్వహించిన రైతులు వాహనాలు మైసమ్మ ఆలయం నుంచి వెళ్తున్నాయని తెలిసి అక్కడకు చేరుకొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రతీ రోజు తెల్లవారు జాము నుంచి యూరియా కోసం తిండి తిప్పలు లేకుండా తిరుగుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం చీటీలు రాసిస్తేనే ఆందోళన విరమిస్తామని భీష్మించారు. దీంతో ఎస్సై తిరుపాజీ జిల్లా వ్యవసాయ అధికారులకు తెలుపడంతో ఏడీఏ రామ్‌పాల్, ఏవో యామారెడ్డి, 8 మంది ఏఈవోలు మైసమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. సోమవారం యూరియా వస్తుందని అధికారులు చీటీలు అందించడంతో రైతులు ఆందోళన విరమించారు. 500 బస్తాలకు పైగా అధికారులు పర్మిషన్ అందించారు. దాదాపు 2 గంటల పాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు అక్కడే ఆగిపోయాయి.

**కష్టాలు తీర్చండంటూ రోడ్డెక్కిన కర్షకులు**

గండీడ్: యూరియా కష్టాలు తీర్చండంటూ రోడ్డెక్కి రైతులు ఆందోళనకు దిగారు. గండీడ్ మం డల కేంద్రంలో శనివారం మహబూబ్‌నగర్ -చించోలి జాతీయ రహదారిపై వాహనాలు వెళ్లకుండా రాళ్లు పెట్టి బైఠాయించి రైతు లు సుమారు అర గంటపాటు ఆందోళన చేపట్టారు. రెండు రోజు లుగా షాపులచుట్టూ తిరుగుతున్నా యూరియా దొరకడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, పోలీసు లు అక్కడకు చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. ఆందోళనను విరమింపజేశారు.

# ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

» రాస్తారోకోతో నిలిచిపోయిన వాహనాలు

» ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించిన మహిళలు


పెద్దకొత్తపల్లిలోని ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు, నాయకులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలాకాలో ప్రజలు తాగునీటి కోసం 20 రోజులుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన ప్రజలు ఎన్నోమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. సహనం కోల్పోయిన మహిళలు ఏకంగా శనివారం మధ్యాహ్నం పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో 167కే జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మధ్య జాతీయ రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో గ్రామపంచాయతీ బోరును తొలగించారు. ఈ బోరుకు ప్రత్యామ్నాయంగా ఆ పక్కనే హైవే రోడ్డు కాంట్రాక్టర్ కొత్తగా బోరు వేశారు. అలాగే మిషన్ భగీరథ పైపులైన్ రోడ్డు విస్తరణలో దెబ్బతినడం మూలంగా ప్రజలకు తాగునీటి సరఫరా 20రోజులుగా నిలిచిపోయింది. దీంతో తాగునీటి కోసం ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు. సహనం కోల్పోయిన పెద్దకొత్తపల్లి గ్రామస్థులు ఖాళీ బిందెలతో మండల కేంద్రంలో జాతీయ రహదారిపై గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. అనంతరం మహిళలు ఖాళీ బిందెలతో ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ముట్టడించారు. నీటి సమస్య తీర్చాలని కోరుతూ ఎంపీడీవో ద్వారా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని పంపారు. గ్రామ మహిళలతో పాటు మాజీ సర్పంచ్ జక్కుల నరసింహ, బీఆర్ఎస్ మండల నాయకులు పి.నాగరాజు, రాజశేఖరశెట్టి, గడ్డిగోపుల బాలస్వామి, విజ్ఞయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు, మండల ప్రధాన కార్యదర్శి పిల్లి నాగరాజు, మీడియా కన్వీనర్ మేకల శివ, నాయకులు సిద్దార్థ, పిల్లి పెద్ద రాములు, కాలనీవాసులు గురు బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పద్మనాభస్వామి నోములు


సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పద్మనాభ స్వామి నోములు నిర్వహిస్తున్న పురోహితులు, దంపతులు

తాడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నందు శనివారం పద్మనాభస్వామి నోములను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఉత్సవ విగ్రహాల ముందు దంపతులు, మహిళా భక్తుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నోములను నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదాలను అందజేశారు. వాస రమేష్, ఆలయ అర్చకులు జగదీశ్వర్, రమేష్, రాఘవేందర్‌గౌడ్, అల్లోజి, శేఖర్, కేశ మల్లయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి అభిషేకాలు


నందివడ్డెమాన్‌లో శనీశ్వర స్వామి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో తిల, తైల అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మ, గోత్ర రీత్యా గ్రహ దోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతి కోసం శనీశ్వర స్వామిని శనివారం నాడు పూజించాలని సూచించారు. శనీశ్వర స్వామిని నల్లని వస్త్రాలు ధరించి నల్ల నువ్వులు, నువ్వుల నూనె, జిల్లెడు ఆకులు, పూలు, జమ్మి ఆకులతో పూజించాలని తెలిపారు. అనంతరం రుద్ర శివుడి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్‌రావు, వీరశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రూ.8 లక్షల 116 పలికిన గణనాథుడి లడ్డూ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కేంద్రంలో గణనాథుడి లడ్డూ వేలం పాటలో రూ.8 లక్షల 116 పలికింది. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ముందు ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలాన్ని శనివారం సాయంత్రం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన సామధాన్ అనే వ్యక్తి లడ్డూ ధరను ఏకంగా రూ.8 లక్షల 116 వరకు వేలం పాట పాడి దక్కించుకున్నారు.

**ఇంటర్వ్యూ..**

## అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డు అందిస్తాం

**- తహసీల్దార్ యూసుఫ్ అలీ**



ఊర్కొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులైనా ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తహసీల్దార్ యూసుఫ్ అలీ అన్నారు. రేషన్ కార్డులతో పాటు స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

**మండలంలో నూతన రేషన్‌కార్డుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?**

మండలంలో నూతనంగా రేషన్‌కార్డులకు 850 కుటుంబాల నుంచి దరఖాస్తులు రాగా అందులో 757 కుటుంబాలకు అప్రూవల్ వచ్చింది. అప్రూవల్ అయిన రేషన్‌కార్డులోని కుటుంబ సభ్యులు 2,243 మంది ఉండగా వారిలో ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం అందిస్తాం.

**పాత రేషన్‌కార్డులో నూతనంగా పేర్లు నమోదు సంఖ్య ఎంత?**

మండలంలోని పాత రేషన్‌కార్డులో నూతనంగా (అడిషన్స్) నమోదు 1,631 కుటుంబాలకు అప్రూవల్ రాగా అందులో 2,611 మంది సభ్యులు ఉన్నారు. అందరికీ బియ్యం అందజేస్తాం.

**మండలంలో ఓటర్లు ఎంతమంది ?**

మండలంలో 22 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి. పురుష ఓటర్లు 8,833, మహిళ ఓటర్లు 9,049 కాగా మొత్తం 17,882 మంది ఓటర్లు ఉన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి సిద్ధం చేసి ఉంచాం. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మండల అధికారులు సిద్ధంగా ఉన్నాము.

**న్యూస్ బాక్స్**

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటేష్, లైన్‌మన్ లక్ష్మణ్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దండలో ఎల్‌టీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

### ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

కోడేరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి విష్ణు శనివారం పలువురి ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన చీకిరాల కమలమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి గ్రామస్థులతో కలిసి కొబ్బరి కాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రొసీడింగ్ వచ్చిన లబ్ధిదారులు 45 రోజుల్లో బేస్‌మెంట్ నిర్మాణం కోసం పనులు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మన్నె బుచ్చిరెడ్డి, సాంబశివుడు, పల్లె కురుమూర్తి, ఆర్.కృష్ణయ్య, చికిరాల నాగేంద్రం, చికిరాల కార్తీక్, ఎండీ సిరాజుద్దీన్, కుమ్మరి సత్యనారాయణ ఉన్నారు.

### ఇద్దరికి స్నేహితుల ఆర్థిక సాయం

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని పెద్దకార్పాముల జిల్లా పరిషత్ హై స్కూల్ 2003-04లో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులకు తోటి స్నేహితులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. పూర్వ విద్యార్థి శంషాద్ బేగం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలుసుకుని పూర్వ స్నేహితులు రూ.22,500లు అందజేశారు. అదే గ్రామానికి చెందిన తన బాల్య మిత్రుడు హరికుమార్ అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లో చికిత్స చేయించుకున్నాడు. తోటి స్నేహితులు అతన్ని కలిసి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు కొల్లే ఈశ్వర్, పరిమళ, వినోద్‌రెడ్డి, ఎండీకరీం, ఎండీ సికిందర్, బుడుగు మల్లయ్య, తొండి రాములు, కృష్ణయ్య, రవికుమార్, రాముడు, సుధాకర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

### శ్రీనివాస కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 6 (ఆంధజ్యోతి) : పట్టణంలోని శ్రీనివాస కాలనీ నూతన కమిటీ అధ్యక్షునిగా ప్రతాప్‌రెడ్డిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతానని అన్నారు. అందరం కలిసికట్టుగా కాలనీ అభివృద్ధి కోసం పని చేస్తామన్నారు. కార్యదర్శిగాచందర్, సహాయ కార్యదర్శులుగా రాజశేఖర్ గౌడ్, విష్ణు, కోశాధికారిగా ఉమాశంకర్, గౌరవ సలహాదారులుగా మంతటి నారాయణ, శేఖర్, కృష్ణయ్య, శివ, రవి, దేశ్యనాయక్, లక్ష్మారెడ్డి, సాయిలు, బాలకిష్టయ్యలను ఎన్నుకున్నారు.

### నేడు సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కందనూలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో ఆదివారం ఉదయం 10:30 గంటలకు సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండీ ఫయాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ హాజరవుతారని తెలిపారు. మండల కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

# విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి

**- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 6 (ఆంధజ్యోతి) : నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పట్టణంలో 33కేవీ సబ్‌స్టేషన్ కోసం శనివారం పట్టణంలోని శితరాలగుట్ట దగ్గర తహసీల్దార్ సైదులు, విద్యుత్ ఏఈ అంజనేయులు, మునిసిపల్ కమిషనర్ మురళితో కలిసి ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసినప్పుడు సబ్‌స్టేషన్ మంజూరు చేశారని తెలిపారు. సబ్‌స్టేషన్‌కు అనువుగా ఉన్న స్థలాన్ని పరిశీలించి, త్వరలో పనులకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ నెల 10న పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మెగా సర్జికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో తారసింగ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభు, డాక్టర్లు మహేష్, బిక్కు, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.



పట్టణ శివారులోని శితరాలగుట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**పశువుల పరిశోధన కేంద్రానికి స్థల పరిశీలన**

అమ్రాబాద్ : నల్లమల ప్రాంతంలోని తూర్పు పొడ జాతి పశువుల పరిశోధన (బ్రీడింగ్) కేంద్రం ఏర్పాటు కోసం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శనివారం అమ్రాబాద్ సమీపంలో 913 సర్వే నెంబరులోని 90ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. మద్దిమడుగు దేవస్థానం కమిటీ వైస్ చైర్మన్ అలరాజు కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో బెంచీలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింగయ్య, తహసీల్దార్ శైలేంద్రకుమార్, ట్రాన్స్‌కో ఏడీ అంజనేయులు, పంచాయతీరాజ్ ఏఈ రుక్మాంగద, అచ్చంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాసుమల్ల వెంకటయ్య, మద్దిమడుగు దేవస్థాన కమిటీ చైర్మన్ రాములునాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు హరినారాయణగౌడ్, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

**- డీఎంహెచ్‌వో రవికుమార్**

కల్వకుర్తి/వెల్దండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్ కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని, డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో భీమానాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, గైన కాలజిస్టు డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ● వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో అసంపూర్తి పనులను జిల్లా వైద్యాధికారి రవికుమార్ పరిశీలించా రు. పనుల విషయమై సంబంధిత కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో భీమానాయక్, డాక్టర్ సింధు, పీవో లక్ష్మణ్ నాయక్, పర్వతాలు, మనోజ్‌కుమార్ ఉన్నారు.



కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రవికుమార్

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**- అడిషనల్ డీఆర్‌డీఏ రాజేశ్వరి**

తిమ్మాజిపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు రుణాలను స్త్రీనిధి ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని అడిషనల్ డీఆర్‌డీఏ రాజేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. ఆమె రికార్డులను పరిశీలించి మహిళలనుద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో మహిళలను చైతన్యం చేయాలని మహిళా సంఘాలు పంచ సూత్రాలు పాటించాలన్నారు. స్త్రీనిధి రూ.2లక్షల రుణం పొందిన మంజుల అనే మహిళ తిమ్మాజిపేటలో ఫొటో స్టూడియో నడుపుతూ జీవనం సాగించడానికి ఆమె అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ నిరంజన్, ఎంపీడీవో లక్ష్మీదేవి, సీసీలు నాగరాజు, యాదమ్మ, వెంకటేశ్వరమ్మ ఉన్నారు.



మహిళా సమాఖ్య సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఏ రాజేశ్వరి

### దాత సహకారంతో తాగునీటి ట్యాంకు నిర్మాణం

బిజినేపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటిని అందించేందుకు అవసరమైన మినీ ట్యాంక్‌ను గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ తోట శ్రీనివాసులు రూ.80వేలతో నిర్మించాడు. మండలంలోని గంగారంలోని పురాతన అంజనేయ స్వామి ఆలయం ఆవరణలో నిర్మించిన తాగునీటి మినీ ట్యాంక్‌ను శనివారం మాజీ సర్పంచ్ గుండ్లపల్లి శేఖర్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి ప్రారంభించి దాతను అభినందించి మాట్లాడారు. గ్రామాభివృద్ధికి మరింత మంది గ్రామస్థులు ముందుకు వచ్చి హితోదికంగా సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గట్టయ్య, తోట చంద్రయ్య, అంజనేయులు, సంద రవి, పిట్టల తిరుపతయ్య, చెన్నారెడ్డి, బొందయ్య, తిరుపతయ్య ఉన్నారు.

## పేదల పక్షాన పోరాడుతున్నది సీపీఐ

**- పార్టీ జిల్లా కార్యదర్శి ఫయాజ్**

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల పక్షాన నిలిచి ప్రశ్నిస్తూ హక్కులను సాధించుకోవడంలో సీపీఐ పోరాడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ వెల్లడించారు. మండలంలోని తీర్నాంపల్లిలో సీపీఐ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కొమ్మరి వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా శేషయ్య, రామకృష్ణ, కోశాధికారిగా శివుడు, కార్యవర్గ సభ్యులుగా రంగస్వామి, సత్యం, బిచ్చన్న, సీతయ్య, భయన్న, నిమ్మల కుర్మయ్య, లింగస్వామి, శివ, నాగేంద్రం, విష్ణు, లాలమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల సీపీఐ కార్యదర్శులు బొద్దుల శ్రీనివాసులు, తుమ్మల శివుడు, జిల్లా నాయకులు కుర్మయ్య, ప్రకాశ్ పాల్గొన్నారు.

### గ్యారెంటీలు అమలు చేయాలి



రేవల్లిలో దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

ఊర్కొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పరశురాములు అన్నారు. శనివారం మండలంలోని రేవల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీల అమలుకు ఒకరోజు దీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్ల కావస్తున్నా గ్యారెంటీల అమలులో నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బ్రహ్మచారి, మల్లేష్ ఉన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు భారీ ఊరట

పెంట్లవెల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు భారీ ఉపశమనం కలిగించిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర అన్నారు. శనివారం మండల కేంద్రంలో జీఎస్టీ తగ్గింపు సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దసరా పండుగ ముందు తీసుకున్న ఈ నిర్ణయాన్ని దేశ ప్రజలందరు హర్షిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మూలే వెంకటేష్, నాయకులు దామోదర్‌రెడ్డి, కురుమూర్తి, శ్రీహరి శర్మ, భాస్కర్‌గౌడ్, అశోక్‌నంద పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట : ప్రధాని నరేంద్రమోదీ జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా నాయకులు నాగేందర్‌గౌడ్, జట్టి వెంకటేశ్, దాచేపల్లి వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయా గ్రామాల నాయకులు శనివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ ద్వారానే దేశానికి రక్షణ ఉంటుందని, స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు డాక్టర్ శివలింగం, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, నిస్వాంత్ ఉన్నారు.

● చారకొండ : జీఎస్టీ తగ్గింపుపై బీజేపీ మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణుశర్మ, శ్రీకాంత్, శంకర్, రవినాయక్, నరేశ్‌యాదవ్, పాల్గొన్నారు.

### గౌడ జేఏసీ మండల అధ్యక్షుడిగా అశోక్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గౌడ జేఏసీ మండల కమిటీ శనివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎం.అశోక్‌గౌడ్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ప్రసాద్‌గౌడ్, మోహన్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా రాజాగౌడ్, సాయికుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భరత్‌గౌడ్, రవీందర్‌గౌడ్, కార్యదర్శులుగా సురేందర్‌గౌడ్, బజారయ్యగౌడ్, పెద్ద లింగస్వామిగౌడ్, లింగస్వామిగౌడ్, రాజుల్‌గౌడ్‌తో పాటు 12మందితో కమిటీ ఎన్నికైంది.

### అంగన్‌వాడీలో అన్నప్రాశన

కల్వకుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో సుభాష్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అన్నప్రాశన కార్యక్రమం జరుపుకున్నారు. ఓ చిన్నారికి అన్నప్రాశన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ టీచర్లు అలివేల, కవిత, లావణ్య, అనూష, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం

తాడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులను మండల విద్యావనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. పీఎస్‌సీఎస్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు త్యాగరాజుగౌడ్, సంఘం బాధ్యులు కట్టా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు, ఫరూక్, విజయ్ కుమార్, రాములు, సైదులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● బిజినేపల్లి మండలం కారుకొండ, గంగారంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణారెడ్డి, రామకృష్ణ ఉపాధ్యాయులు రాజారాంప్రకాష్, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, లావణ్య, శ్రీకాంత్, చెన్నమ్మ, రత్నశే ఖర్, రాజప్ప, మహమ్మద్, అశోక్, కోములయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఇందుమతి, ఊర్మిళ, రామస్వామి పాల్గొన్నారు. ● పెద్దకొత్తపల్లిలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు శనివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జియావుద్దీన్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు డి.రామకృష్ణ, డి.మల్లయ్య, రాముడు నాయక్, శ్రీనివాసులు, దేవయ్య, పోషన్న, ఎమ్మార్సీ సిబ్బంది స్వామి, శివలింగం, ఈశ్వర్, రాములుయాదవ్, మురళి పాల్గొన్నారు. ● చారకొండ : మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌కుమార్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం అందుకోవడంతో శనివారం పాఠశాలలో గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖదీర్, విద్యార్థులు, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు కొర్ర మణిపాల్‌నాయక్, కొర్ర లక్ష్మణ్, లక్ష్మయ్య, కొర్ర సురేశ్, కొమ్ము మహేశ్, అనిల్‌కుమార్, సంతోశ్‌కుమార్ ఉన్నారు.



తాడూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

**శ్రీచైతన్య పాఠశాలలో స్వయం పాలన**

నాగర్‌కర్నూల్‌టౌన్ : స్థానిక ఈశ్వర్ కాలనీలో గల శ్రీచైతన్య పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాత్రపోషించి స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాజీవ్‌ప్రియదర్శన్, ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ శివరాంరెడ్డి, అకాడమిక్ డీన్ చంద్రశేఖర్, సి.ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

## అట్టహాసంగా గణనాథుల నిమజ్జనం

తాడూరు, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోనిగ్రామాల్లో శనివారం సైతం వినాయక నిమజ్జనాలు అట్టహాసంగా కొనసాగాయి. ప్రధానంగా మేడిపూర్‌లోని ముదిరాజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద లడ్డూకు వేలం నిర్వహించగారూ.30వేలకు అదే గ్రామానికి చెందిన రేణయ్యగౌడ్ దక్కించుకున్నారు. గోవిందాయపల్లి, ఐతోల్, ఇంద్రకల్, భలాన్‌పల్లి తదితరగ్రామాల్లో సైతం వినాయక నిమజ్జనాలు జరిగాయి.



మేడిపూర్‌లో గణనాథుని వద్ద వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న రేణయ్య

## పేదలకు అండగా నిలవడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి**

కల్వకుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని తిమ్మరాసిపల్లికి చెందిన జంగయ్యకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.4 లక్షల ఎల్‌వోసీ ఎమ్మెల్యే మంజూరు చేయించారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు ఆ ఎల్‌వోసీని అందజేశారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

## ఘనంగా జూపల్లి అరుణ్ జన్మదినం

**- పట్టణంలో బైక్ ర్యాలీ, కేక్ కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు**

కొల్లాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ యువ నాయకుడు,రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు కొల్లాపూర్ పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ ఆధ్వర్యంలో ముందుగా రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయం ఎదుట కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థుల సమక్షంలో జూపల్లి అభిమానులు, శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జూపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కొల్లాపూర్ పట్టణ వీధుల గుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో జూపల్లి అరుణ్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి బాణసంచా కాల్చారు. ఒకరికొకరు కేక్ తినిపించుకొని పట్టణ పేద వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ద్వారా ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తు నిరుపేదలకు అండగా ఉంటూ తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్, పసుపుల నరసింహ, బచ్చలకూర బాలరాజు, వంగ రాజశేఖర్‌గౌడ్, ఖాదర్ పాషా, బోరెల్లి మహేష్, నయీమ్, అన్వర్, వేణు, రాముడుయాదవ్, కమలాకర్‌రావు, కృష్ణమనాయుడు, సత్యం, కిరణ్ తేజగౌడ్, వెంకటేష్, దిలీప్, కిషోర్, రమేష్, మహేష్ పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో జూపల్లి అరుణ్ జన్మదిన వేడుకలు చేపట్టిన రత్నగిరి ఫౌండేషన్ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు

## అనుబంధాలు కనుమరుగవుతున్నాయి

**- కొడుకు చేతిలో హత్యకు గురైన కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

కల్వకుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కుల్వకుర్తి పట్టణంలో కొడుకు చేతిలో దారుణ హత్యకు గురైన బాలయ్య కుటుంబాన్ని స్థానిక మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ శనివారం పరామర్శించారు. హత్యకు గురైన చంద్రయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే, మృతుని భార్య చంద్రమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ రోజు రోజుకు అ నుబంధాలు తెగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు మానవీయ విలువలను కాపాడుకోవాలని సూచించారు. ఆయన వెంట సూర్యలత కాటన్ మిల్ అధ్యక్షుడు ఆయినేని సూర్యప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భవాండ్ల మధు, మార్చాల బీఆర్ఎస్ నాయకు లు కృష్ణారెడ్డి, నాయకులు రామకృష్ణ తదితరులు ఉన్నారు.



హత్యకు గురైన మృతుడు బాలయ్య భార్య చంద్రమ్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్

## ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం**

వెల్దండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి తప్పులు దొర్లకుండా ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్‌ల జాబితాను ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డితో కలిసి ఆయన విడుదల చేశారు. ఓటర్ల జాబితాపై ఏవైనా తప్పులు దొర్లితో ఈనెల 8 వరకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. అదేవిధంగా మండలంలోని అన్నిపార్టీల ప్రతినిధులతో ఈ విషయంపై సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. 10వ తేదీ రోజున సవరించిన తుది జాబితాను విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, సూపరింటెండెంట్ రేవంత్‌రెడ్డి, కార్యదర్శులు గిరిగౌడ్, ఫయాజ్ ఉన్నారు.



ఓటరు జాబితా ముసాయిదాను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

## యూరియా సరిపడా సరఫరా చేయాలి

**- సీపీఎం మండల కార్యదర్శి వర్థం సైదులు**

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరతను నివారించి రైతులకు సరిపడా సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వర్థం సైదులు అన్నారు. యూరియాను రైతులకు సరిపడా సరఫరా చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు మల్లేష్, రాములు, వెంకటయ్య, చంద్రు, లింగమ్మ, రామచంద్రయ్య, అంజనమ్మ, గణేష్‌నాయక్, లాలిబాయి, చిన్నిబాయి, వెంకటయ్య పాల్గొన్నారు.

**మురుగు తొలగించాలి**

● తెలకపల్లి : మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయం ప్రాంతంలోని మురుగు నీటిని తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్థం పర్వతాలు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం బృందం మండల కేంద్రంలో పర్యటించి, ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. 1, 2, 3, 5వ వార్డుల్లో ఉన్న మురుగునీరు పోచమ్మ దేవాలయం ఆవరణంలోకి రావడంతో ఆ ప్రాంతమంతా మురుగు కుంటలా ఏర్పడిందని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాస్, జిల్లా నాయకులు నాగపూర్ మధు, తెలకపల్లి శాఖ కార్యదర్శి విజయ్‌గౌడ్, హుసేన్ పాల్గొన్నారు.

● కొల్లాపూర్ : అర్హులైన నిరుపేదలందరికీ ప్రజాప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మునిసిపాలిటీ ముందు ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ, టౌన్ కార్యదర్శి సలీం, జిల్లా నాయకులు తారాసింగ్ మాట్లాడుతూ కొల్లాపూర్ పట్టణంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ప్రతీ వార్డులో సైడ్ డ్రైనేజీ కాలువలను నిర్మించాలని, మిషన్ భగీరథ పైపులైన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని మునిసిపాలిటీ మేనేజర్ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు బాలు నాయక్, సంజీవ్, వెంకటస్వామి, రామకృష్ణ, ఎల్లయ్య, బంగారి ఈదన్న, బాలస్వామి, పాల్గొన్నారు.



అచ్చంపేట : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

● అచ్చంపేట : గిరిజన హాస్టళ్లలో పనిచేస్తున్న దినసరి వర్కర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శనివారం పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలోని హాస్టళ్లలో పనిచేస్తున్న దినసరి వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల9న జరిగే చలో ప్రజాభవన్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు గోపాల్, సురేందర్, పర్వతాలు, ప్రశాంత్, ముసలయ్య, ఎల్లమ్మ పాల్గొన్నారు.